# బీఆర్‌ఎస్‌తోనే.. పేదలకు న్యాయం

**తప్పుడు హామీలు ఇచ్చిన కాంగ్రెస్‌పై తిరుగుబాటు మొదలైంది: ఎమ్మెల్యే దానం నాగేందర్**

బంజారాహిల్స్,అక్టోబర్ 25: తెలంగాణ రాష్ట్రంలోని బీసీలు, ఎస్సీలు,మైనార్టీలతో పాటు ఇతర పేద వర్గాలకు న్యాయం జరగాలంటే మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావాల్సిందే అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు బరిగెల వెంకటస్వామి తదితరులు రానున్న ఎన్నికల్లో అన్ని వర్గాలకు చెందిన ప్రజల మద్దతును కోరుతూ రూపొందించిన పోస్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..సబ్బండ వర్గాల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ పదేళ్ల పాలన సాగించారన్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడంతో పాటు రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రయోజనాలు కాపాడడమే ఎజెండాగా పనిచేసిన బీఆర్‌ఎస్ పార్టీ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందన్నారు. కొన్ని పార్టీల నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ.. సోషల్‌మీడియాలో ప్రభుత్వంపై బురద చల్లడం తప్ప క్షేత్రస్థాయిలో ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పూర్తిస్థాయిలో నమ్మకం ఉందన్నారు. దేశంలోనే ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో మరోసారి భారీ మెజార్టీతో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీసెల్ అధ్యక్షుడు బరిగెల వెంకటస్వామి,ఆంథోనీ,రాజే, రాజేష్ నాయక్, రవి, విష్ణునాయక్, తదితరులు పాల్గొన్నారు.




ఖైరతాబాద్‌లో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

## పోలింగ్ ప్రక్రియపై రేపు,ఎల్లుండి సిబ్బందికి శిక్షణ

**-రిటర్నింగ్ అధికారి వెంకటేష్ ధోత్రే**




ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్న ట్రైనర్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌వో వెంకటేష్ ధోత్రే

బంజారాహిల్స్,అక్టోబర్ 25: అసెంబ్లీ ఎన్నికల విధుల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బందికి శిక్షణ ఇచ్చే మాస్టర్ ట్రైనర్స్‌తో ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేష్ ధోత్రే బుధవారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలోని 245 పోలింగ్ స్టేషన్లలో విధులు నిర్వహించనున్న పోలింగ్ ఆఫీసర్స్, అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్స్‌తో సహా సుమారు 800 మంది సిబ్బందికి బంజారాహిల్స్‌లోని ముఫకంజా కళాశాలలో ఈ నెల 27,28 తేదీల్లో శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని వెంకటేష్ ధోత్రే తెలిపారు.

రెండ్రోజుల పాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో భాగంగా పోలింగ్ ప్రక్రియ, ఈవీఎమ్‌ల వినియోగం, పోలింగ్ స్లిప్స్, ఇతర అంశాలపై సమగ్రమైన శిక్షణ ఇవ్వనున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఈఆర్‌వోలు ప్రశాంతి, అనితారెడ్డి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 14 నుంచి శ్రీ భద్రకాళి సమేత వీరభద్రుడి కల్యాణం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న తనికెళ్ల భరణి తదితరులు

ఖైరతాబాద్, అక్టోబర్ 25 : లోక కల్యాణార్థం శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర ఆరాధ్య జనసేవా వాహిని ట్రస్ట్ ఆధ్వర్యంలో డిసెంబర్ 14 నుంచి 17 వరకు సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కల్యాణం, వీధి పళ్లెం క్రతువులను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు తాడికొండ విజయ్ కుమార్ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహోత్సవానికి సంబంధించిన బ్రోచర్లను ప్రముఖ నటుడు, రచయిత తనికెళ్ల భరణి, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏఎస్ ముక్తేశ్వర రావు, సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్, ప్రముఖ పౌరాణికులు బంగారయ్య శర్మతో కలిసి ఆవిష్కరించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ యావత్ ప్రజానీకం ఈతి బాధలు, భయభ్రాంతులు, కరువు కాటకాలు, అనారోగ్య సమస్యలు, అకాలమరణాలు, ప్రకృతి వైపరీత్యాలు, ఉగ్రవాదుల విధ్వాంసాదాడులు, యుద్ధాలు, అంతర్గత కలహాలు, రాజకీయ సంక్షోభం తదితర ఆపదలు తొలగిపోవాలన్న సంకల్పంతో ఈ మహత్తర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. శృంగేరీ శారద పీఠాధీశ్వరులు జగద్గురు శంకరాచార్య, హింపీ విరుపాక్ష పీఠాధీశ్వరులు విద్యారణ్యభారతి స్వామి, పుష్పగిరి పీఠాధీశ్వరులు విద్యాశంకరా భారతి స్వామి, శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర స్వామి పర్యవేక్షణలో ఈ మహోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ మహాక్రతువుకు భక్తులు అశేష సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో ట్రస్ట్ సుధాకర్ గుప్తా, తాడికొండ శశిభూషణ్, శశిధర్, యమునా పాఠక్, నందితా కపూర్ తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ విజేతలకు బహుమతి ప్రదానం

బంజారాహిల్స్,అక్టోబర్ 25: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని 18 బస్తీల్లోని యువత కోసం బీఆర్‌ఎస్ సీనియర్ నేత తన్నీరు రాములు ఆధ్వర్యంలో దసరా పండుగ వేడుకల్లో భాగంగా నిర్వహించిన డీఎన్‌ఆర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బహుమతులు అందజేశారు. 16 జట్లు పాల్గొన్న ఈ పోటీల్లో బీజేఆర్‌నగర్ ప్లేయింగ్ ఎలెవన్ జట్టు విజేతగా నిలిచింది. పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీ జట్టు రన్నరప్ టైటిల్‌ను గెలుచుకుంది. ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్ చౌరస్తాలో ఏర్పా టు చేసిన కార్యక్రమంలో విజేత జట్టుకు ఎమ్మెల్యే దానం నాగేందర్ చేతులమీదుగా ట్రోఫీతో పాటు రూ.50వేల ప్రైజ్ మనీని అందించారు. రన్నరప్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.25వేల ప్రైజ్ మనీ అందజేశారు.



క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

## ఆటో డ్రైవర్లకు సామాజిక భద్రత కల్పించాలి

హిమాయత్‌నగర్,అక్టోబర్ 25: రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వశక్తితో ఆటోలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి,కొత్త ఆటోలకు పర్మిట్లు ఇవ్వాలని కోరారు.అసంఘటిత రంగ కార్మికులుగా ఉన్న ఆటో డ్రైవర్స్‌కు సామాజిక భద్రత కల్పించి, ఆటో,క్యాబ్ మీటర్ చార్జీలు పెంచాలని విజ్ఞప్తి చేశారు.గ్రేటర్ ఆటోలకు తగినన్ని పార్కింగ్ స్థలాలు ఇవ్వడంతో పాటు పెరిగిన ఇన్సూరెన్స్ ధరలను తగ్గించాలని కోరారు.



### ముమ్మరంగా వాహన తనిఖీలు

అసెంబ్లీ ఎన్నికల్లో కోడ్‌లో భాగంగా బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహన తనిఖీలు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద వాహనాలను ఆపి అక్రమ నగదు, మద్యం బాటిళ్ల తరలింపును అడ్డుకునేందుకు తనిఖీలు చేపట్టారు.

– బంజారాహిల్స్,అక్టోబర్ 25:

## ఆలయంలో హుండీలు చోరీ

బంజారాహిల్స్,అక్టోబర్ 25: అమ్మవారి ఆలయంలో ప్రవేశించిన దుండగులు హుండీలను ఎత్తుకెళ్లిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ సమీపంలోని నాగదేవత ఆలయంలో ఈనెల 24న అర్ధరాత్రి దాటిన తర్వాత ఇద్దరు దుండగులు గేటు తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. ఆలయం ఆవరణలో ఉన్న రెండు హుండీలు తస్కరించారు. బుధవారం ఆలయ నిర్వాహకులు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హుండీలో సుమారు రూ.20వేల వరకు నగదు ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆలయంలోని సీసీ ఫుటేజీని సేకరించిన పోలీసులు దొంగల కోసం గాలింపు చేపట్టారు.

## సంక్షేమ పథకాలు ప్రజలకు అందజేస్తాం

**ఎంబీసీ చైర్మన్ నందికంటి శ్రీధర్**

మల్కాజిగిరి, అక్టోబర్ 25: ప్రభుత్వం అమలుపరుస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రజలకు అందజేస్తామని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ అన్నారు. బుధవారం వెంకటాపురం డివిజన్, భూదేవినగర్‌లో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంబీసీ చైర్మన్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. పార్టీ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డిని భారీ మెజార్టీ తో గెలిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సబితా కిశోర్, అనిల్‌కిశోర్, శ్రీనివాస్, ఆశారాణి, సత్యనారాయణ పాల్గొన్నారు.

## విజువల్ ఆర్ట్స్ సృజనాత్మకతకు దోహదం

ఖైరతాబాద్, అక్టోబర్ 25 : విజువల్ ఆర్ట్స్ పిల్లలకు సృజనాత్మకత పెంచుతుందని నటి, రచయిత, ఇండ్ ఫేమ్ సీఈవో గీతాభాస్కర్ దాస్యం తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. ఇండియా ఫైన్ ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఎల్‌కేజీ నుంచి ఏడో తరగతి వరకు విద్యార్థులకు నేర్పించేందుకు చిత్రకళల ప్రత్యేక కోర్సును రూపొందించామన్నారు. ఆరు నెలల కోర్సును ఉపాధ్యాయులకు అందిస్తామని, తద్వారా విద్యార్థులకు సైతం చేరుతుందన్నారు. ఆ దిశగా తాము కార్యాచరణ తయారు చేసుకున్నామన్నారు.




సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న గీతా భాస్కర్

## ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

హిమాయత్‌నగర్,అక్టోబర్ 25: దేశంలోని యువజనుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న ఏఐవైఎఫ్ 2వ మహాసభలు ఈ నెల 29,30 తేదీల్లో హిమాయత్‌నగర్‌లోని తెరా పంత్ భవన్‌లో వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఊతమిస్తూ .. నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తోందన్నారు.ఈ మహాసభల్లో యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు పలు అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని వివరించారు.